


**వర్ధన్నపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 279 ఆదివారం 1 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# పేదవాడి ఆశలు నెరవేర్చేనా..!



## నేడు పార్లమెంట్ ముందుకు కేంద్ర బడ్జెట్

**ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం**

**ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్**

**పన్ను మినహాయింపులపైనే అందరి చూపు**

**ప్రధాని మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌కు 9వది**



న్యూఢిల్లీ,**జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది.మిగతా 2లో...

# చంద్రబాబుపై అంబటి అసభ్య వ్యాఖ్యలు



**సీఎం చంద్రబాబుపై వ్యాఖ్యల కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్**

**టీడీపీ నేత బాజీ చౌదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**

**అంబటి ఇంటి వద్ద 6 గంటలకు పైగా టీడీపీ శ్రేణుల నిరసన, ఆందోళన**

**తీవ్ర ఉద్రిక్తతల మధ్య అంబటిని వజ్రవాహనంలో తరలించిన పోలీసులు**

**అంబటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టీడీపీ మంత్రులు, నేతలు**

గుంటూరు,**జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరులోని నవభారత్ నగర్ లోని నివాసం నుంచి ఆయనను తీవ్ర ఉద్రిక్తత మధ్య పోలీసుమిగతా 2లో...




# దేవదేవుడికి అపచారం చేసి అబద్ధాలా



**కల్తీ జరగలేదని ఇంకా దబాయింపులా**

**వైసిపి మూల్యం చెల్లించుకోక తప్పదు**

**సంబరాలు చేసుకోవడంపై మండిపడ్డ మంత్రి కేశవ్**

అమరావతి, **:జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
కోట్లాదిమంది హిందువుల నమ్మకాన్ని దెబ్బతీసి, కల్తీ నెయ్యితో లడ్డూలను తయారు చేయించి అక్రమాలకు పాల్పడ్డ వైకాపాను దేవుడు కూడా క్షమించడని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దేవుడి మీద వారికి విశ్వాసంమిగతా 2లో...

## రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాను ఇబ్బందులు గురిచేస్తున్నారు

**: నటుడు విజయ్**



# మన లక్ష్యం జీరో రెబల్స్

**కనీసం 90 స్థానాల్లో జెండా ఎగరేయాలి**

**పంచాయతీలను మించిన ఫలితాలు సాధించాలి**

**బలహీనంగా ఉన్న చోట ప్రత్యేకంగా దృష్టి సారించండి**

**పురపోరుపై సీఎం దిశా నిర్దేశం**


**అమెరికా నుంచి నేతలతో జూమ్ మీటింగ్**

**పాల్గొన్న మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్ **జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి 'జీరో రెబల్స్' లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిడ కాంగ్రెస్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో రెబల్స్ బెడద పార్టీని తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల మున్సిపల్ ఎన్నికల్లో అలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. జీరో రెబల్స్ నినాదంతో ముందుకు పోవాలని సూచించారు. రెబల్స్‌ను బుజ్జగించి, ఒప్పించి, మెప్పించి మిగతా 2లో...



## మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం



**శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక**

**కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె**

**అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ**

ముంబై,జనవరి31:
నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారుమిగతా 2లో...



# కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

**పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం**

**తెలంగాణ తెచ్చిన పెద్దాయననే అవమానిస్తారా**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

హైదరాబాద్, **జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. తెలంగాణమిగతా 2లో...


# ముగిసిన జనజాతర

**గద్దెలు వీడిన అమ్మవార్లు**

**చిలకలగుట్ట చేరిన సమ్మక్క**

**జయజయధ్వానాలతో వీడ్కోలు**

**ఇళ్లకు పయనమైన భక్త జనం**



మేడారం, **జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
మేడారం గద్దెపై కొలువై.. మూడు రోజులుగా పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల నడుమ పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారిని సాగనంపే క్రతువులో గిరిజనమిగతా 2లో...

# బాధ్యతగల పౌరుడిగా దర్యాప్తునకు సహకరిస్తా

**నోటీసులు గోడలకు అంటించడం చట్టవిరుద్ధం**

**ఎర్రవల్లి ఫాంహౌజ్‌లోనే విచారణ జరపాలి**

**అయినా నేడు 3 గంటలకు నందినగర్‌లో అందుబాటులో ఉంటా**

**: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

హైదరాబాద్**జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :**
ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) అధికారుల నోటీసులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) స్పందించారు. సిట్ అధికారులకు నోటీసులిచ్చే అధికారమే లేదనీ, మిగతా 2లో...



# పేదవాడి ఆశలు నెరవేర్చేనా

(మొదటి పేజీ తరువాయి)
అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ఉంటుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశలు నిజం చేసే దిశగానే కేంద్రం బ్జడెట్ ఉండనుందని సమాచారం. పన్నుల విషయంలో కీలక మార్పులు జరగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026లో ఆదాయపు పన్ను నిబంధనలో పలు మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, సీనియర్ సిటిజన్లకు లాభం చేకూరేలా ఈ మార్పులను కేంద్రం తీసుకువస్తుందని సమాచారం. పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, పన్ను విషయంలో భారాన్ని తగ్గించడం, పారదర్శకత, డిజిటల్ పన్ను వ్యవస్థను ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడమే లక్ష్యంగా బడ్జెట్ ఉండనుందన్న వార్తలు వస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను చట్టం 1961 నుంచి.. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 వరకు సరళమైన పరివర్తనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సత్వర పన్ను వాపసులు, సరళీకృత సమ్మతి కీలక లక్ష్యాలుగా ఉండనున్నాయని సమాచారం. వార్షిక సమాచార ప్రకటన, పన్ను చెల్లింపుదారుల సమాచార సారాంశం వంటి వ్యవస్థలు పన్ను దాఖలును సులభతరం చేశాయి. డిజిటల్ వ్యవస్థను మరింత నమ్మదగినదిగా, పారదర్శకంగా మార్చడంపై బడ్జెట్ 2026 దృష్టి సారించే అవకాశముంది. ఏఐని సరిగ్గా ఉపయోగించినట్లయితే పన్ను రిటర్న్‌లను ఆటోమేటిక్‌గా దాఖలు చేయొచ్చని, లోపాలను తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను వాపసుల కోసం రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సాయపడనుంది. ఆదాయపు పన్ను కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రాధాన్యం, క్రిప్టో, డిజిటల్ ఆస్తులపై స్పష్టమైన నియమాలకు ఉపయోగ పడుతుంది. మరోవైపు.. కొత్త పన్ను విధానం వచ్చినప్పటికీ కొన్ని అంశాల్లో పాత పన్ను విధానం అందుబాటులో ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గృహ రుణాలు, బీమా ప్రీమియంలు, పదవీ విరమణ పొదుపులు, ఇతర పెట్టుబడులకు సంబంధించిన పన్ను తగ్గింపులకు సంబంధించి పాత విధానాలే ఉంటాయని తెలుస్తోంది. బాగా పన్ను రాయితీ కలిగిన వారు పాత పన్ను విధానం నుంచి ప్రయోజనం పొందడం కొనసాగించవచ్చు. అయితే తక్కువ పన్ను మినహాయింపులు ఉన్న వ్యక్తులు కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సరైన విధానాన్ని ఎంచుకోవడం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అవుతుంది. విద్యా, గృహ ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలను నిర్వహించే కుటుంబాలకు ఈ మార్పులు ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని అందించవచ్చు. 2026లో ఆదాయపు పన్ను నియమాల మార్పు నుంచి సీనియర్ సిటిజన్లు కూడా ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా పెన్షన్ ఆదాయం, వాటి వడ్డీ ఆదాయాలపై సరళీకృత పన్ను విధించడం ద్వారా పన్ను దాఖలును సులభతరం చేస్తాయి. ఏది ఏమైనప్పటికీ.. ట్యాక్స్ ప్లేయర్లకు కేంద్రం శుభవార్త చెప్పనుందని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన పన్ను విధానం పెద్దగా ప్రయోజనకారిగా లేదన్న విమర్శలు

# చంద్రబాబుపై అంబటి అసభ్య వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి) వాహనంలోకి ఎక్కించి తరలించారు. వివరాల్లోకి వెళితే, గుంటూరులో తిరుమల లడ్డూల్లో నెయ్యి కల్తీ జరిగిందంటూ టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదంపై స్పందిస్తూ అంబటి రాంబాబు ముఖ్యమంత్రిని ఉద్దేశించి తీవ్రమైన, అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నేతలు, కార్యకర్తలు గుంటూరులోని అంబటి నివాసం వద్దకు భారీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. దాదాపు 6 గంటలకు పైగా నిరసన కొనసాగింది. ఈ క్రమంలో ఆయన ఇంటిపై రాళ్లు రువ్వడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నల్లపాడు పోలీసులు అంబటిపై కేసు నమోదు చేశారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ, పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి ప్రత్యేక వజ్రవాహనంలో అక్కడి నుంచి తరలించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు కూడా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంబటి వ్యాఖ్యలను మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, హోం మంత్రి అనిత, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. అంబటి వ్యాఖ్యలు 'దుర్మార్గం', 'నీచం' అని అభివర్ణిస్తూ, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబును దూషించిన మీడియా వైరల్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహం పెల్లు బుకింది. తెలుగు మహిళలు గుంటూరు నగరంలోని అంబటి రాంబాబు ఇంటి వద్దకు చేరుకుని నిరసనకు ప్రయత్నించారు. అయితే అప్పటికే ఆయన ఇంటి వద్దకు వైసీపీ శ్రేణులతో పాటు రౌడీషీటర్లు చేరుకున్నారు. వారు తెలుగు మహిళల వెంటపడి తరిమికొట్టారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అంబటి ఇంటి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా, పోలీసులు వారి ని అక్కడ అడ్డుకున్నారు. ఇంటి వద్ద నడిరోడ్డుపై మరోసారి రెచ్చిపోయిన అంబటి.. అక్కడే మీడియాతో మాట్లాడుతూ, మరోసారి చంద్రబాబును ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడారు. "చంద్రబాబును నేను తిట్టలేదు. నన్ను చంపడానికి కర్రలు, రాడ్లతో టీడీపీ కార్యకర్తలు, మహిళలు రావడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో క్షణికావేశంలో అలా మాట్లాడా ల్సి వచ్చింది. నన్ను తిడుతున్న మహిళలను నేను కూడా ఒక మనిషిగా తిట్టకూడదా? చంద్రబాబుకు, లోకేశ్‌కు, ఆయన నడిపిస్తున్న రెడ్ బుక్‌కు నా ఇంట్లో కుక్క కూడా భయపడదు. దమ్మంటే అరెస్టు చేసుకోండి. అరెస్టుకు సిద్ధంగా ఉన్నా... బెయిల్ కూడా తీసుకోను... జైల్లో ఉంటా... నీ సంగతి తెలుస్తా.. ఐ డోంట్ కేర్... నేను పారిపోను. ఇంట్లోనే ఉంటా... ఇది తెగింపు కాదు పిల్లిని కట్టేసి కొడితే పులిలా మారుతుంది. ప్రస్తుతం నేను కూడా అలానే..." అంటూ తనను పులిలా అభివర్ణించుకున్నారు..

**అంబటి రాంబాబుకు జగన్ ఫోన్**
**దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సీఎం**

అంబటి రాంబాబుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేశారు. టీడీపీ దాడికి గురైన అంబటిని పరామర్శించి ధైర్యం చెప్పిన వైఎస్ జగన్.. రాష్ట్రం జంగిల్‌రాజ్‌గా మారిపోయిందన్నారు. చంద్రబాబు ఆటవిక రాజ్యాన్ని నడుపుతున్నారని వైఎస్ జగన్
ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దుర్మార్గాలు రోజురోజుకూ పెరిగిపోయాయన్న వైఎస్ జగన్.. ఉద్దేశపూర్వకంగానే హత్యాయత్నం, దాడులకు దిగారన్నారు. ప్రజలన్నీ చూస్తున్నారు. ఈ అరాచకపాలనను ప్రజలు సహించబోరు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షకుల్లా వ్యవహరించారు. అంబటికి పార్టీ మొత్తం అండగా ఉంటుంది' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అంబటిపై టీడీపీ గూండాల హత్యాయత్నాన్ని వైఎస్సార్‌సీపీ సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేసింది. లడ్డూ విషయంలో సిట్ ల్యాబ్ రిపోర్టుల ఫలితాలతో అడ్డంగా దొరికిపోవడంతో బాబు హింసను రాజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. దాంట్లో భాగంగానే వరుస దాడులు జరుగుతున్నాయన్న వైఎస్సార్‌సీపీ.. పథకం ప్రకారమే అంబటిపై హత్యాయత్నం చేశారని పేర్కొంది. అంబటిపై హత్యాయత్నాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లనుంది. కేంద్ర హోంశాఖకు వైవీ సుబ్బారెడ్డి లేఖ రాయనున్నారు.

# మన లక్ష్యం జీరో రెబల్స్

(మొదటి పేజీ తరువాయి)
వారితో నామినేషన్లను ఉపసంహరింపజేయాలని కోరారు. పార్లమెంటు నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా ఉన్న మంత్రులు ఈ బాధ్యతను భుజానికెత్తుకోవాలని మార్గదర్శనం చేశారు. జిల్లాల్లోని నేతల మధ్య విభేదాలను రెండు రోజుల్లో పరిష్కరించాలని సీఎం నొక్కి చెప్పారు. కనీసం 90 మున్సిపాల్టీల్లో పార్టీని గెలిపించి, కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. దాదాపు రెండు వారాలపాటు విదేశీ పర్యటనలో బిజీబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డిడ మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించారు. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకున్న ఆయన శనివారం అమెరికా నుంచి కాంగ్రెస్ నేతలతో జూమ్ మీటింగ్ నిర్వ హించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూడఎన్నికల ప్రచారం, ఎజెండా తదితరాంశాలపై చర్చించారు. పార్టీకి తలనొప్పిగా మారిన వర్గపోరు, ఆధిపత్య పోరును ఎలా అధిగమించాలనే అంశాలపై ఆయన నేతలతో సమాలోచనలు చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నుంచి క్షేత్రస్థాయి దాకా నేతలందరూ మంచి ఐక్యతను ప్రదర్శించారని, ఇప్పుడు కూడా అదే ఐక్యతను ప్రదర్శించటం ద్వారా మున్సిపోల్స్‌లో కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఇదే సమయంలో పార్టీ బలహీనంగా ఉన్నచోట గెలుపు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైతే ఆయా మున్సిపాల్టీల్లో చేరికలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు ఈ బాధ్యతలను తీసుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకున్నప్పటికీ కొన్ని కీలక ప్రదేశాల్లో పార్టీ పట్టు కోల్పోయిందని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యంగా కొందరు ఎమ్మెల్యేల సొంత గ్రామాల్లో సైతం పార్టీ ఓడిపోవటం మైనస్ అయ్యిందని చెప్పుకొచ్చారు. ఈసారి అలాంటి పొరపాట్లు జరక్కుండా చూసుకోవాలని, నేతలందరూ అలర్ట్‌గా ఉండాలని హెచ్చరించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేందుకు టీమ్ వర్క్ చెయ్యాలని సీఎం నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని ప్రతిపక్షాలు ప్రచారం చేశాయని గుర్తు చేశారు. అలాంటి ఫేక్ సర్వేలు, ఫేక్ ప్రచారాలు చూసి నాయకులు ఆందోళన చెందొద్దని సూచించారు. ఆ ఉప ఎన్నికలో టీమ్ వర్క్ చేసి ఘన విజయం సాధించామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం అదే వ్యూహంతో ముందుకు వెళ్దామంటూ సీఎం సూచించారు.

**రేపు హైదరాబాద్‌కు సీఎం.. 4వ తేదీ నుంచి ప్రచారం**

ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈనెల 4వ తేదీ నుంచి ఆయన పూర్తిస్థాయిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 4న మిర్యాలగూడలో, 5న కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఆయన ఎలక్షన్ ప్రచారం నిర్వహిస్తారు. 6న నిజామాబాద్ రూరల్, 7న వికారాబాద్ జిల్లా పరిగి, 8న భూపాలపల్లిలో సీఎం ప్రచార సభలు నిర్వహించనున్నారు.

# దేవదేవుడికి అపచారం చేసి అబద్ధాలా

(మొదటి పేజీ తరువాయి)
లేకపోవచ్చుగానీ, భక్తులుగా మాకు విశ్వాసం ఉందని అన్నారు. టీటీడీ లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీకి ఎలాంటి క్లీన్ చిట్ రాలేదని పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వైసీపీ తమకు క్లీన్ చిట్ వచ్చినట్లు చేసుకుంటున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దేవదేవుడి విషయంలో పాపం చేసి సంబరాలు చేసుకోవడానికి ఆ పార్టీ నేతలకు సిగ్గుండాలని విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం స్వామివారి లడ్డూ పవిత్రతను కాపాడేందుకు అనేక పకడ్బందీ నిబంధనలు పెట్టిందని.. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ నిబంధనలను సడలించి కల్తీకి బీజం వేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2022లో సీఎఫ్‌టీఆర్ఐ నెయ్యి పేరిట సరఫరా అయిన పదార్థాల్లో జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారించిందని.. ఆ నివేదికను నాటి వైసీపీ ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పాటు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రి విమర్శించారు. దేవుడి ప్రసాదానికి ముడిసరకు పంపిణీని ఆర్థిక అంశంగా మాత్రమే గత పాలకులు చూశారన్నారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు హవాలా మార్గంలో వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉందన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ల్యాబ్ అయిన ఎన్‌డీడీబీ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారణ చేసిన అంశాన్నే సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారని.. ఇదే విషయం సిట్ అనుబంధ ఛార్జ్ షీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని మంత్రి వివరించారు. వైసీపీ చెబుతున్నట్లుగా క్లీన్ చిట్ ఎక్కడ వచ్చిందో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమాపణలు కోరాల్సింది పోయి, తప్పే జరగనట్లు ప్రజలను మోసం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేస్తారా అంటూ ÷ర్ అయ్యారు. జరుగుతున్న విపరీత ప్రచారాలు చూసి తట్టుకోలేకే వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నామే తప్ప.. తిరుమల శ్రీవారి విషయంలో రాజకీయం చేసే ఉద్దేశం తమకు లేదని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. క్లీన్‌చీట్ అంటూ ఆ పార్టీ చేసుకునేది అసత్య ప్రచారమని మండిపడ్డారు. లడ్డూ పవిత్రతను కాపాడేందుకు తెదేపా ప్రభుత్వం అనేక నిబంధనలు ప్రవేశపెట్టింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిబంధనలు సడలించి కల్తీకి బీజం వేసింది. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు అంత తేలిగ్గా వదలిపెట్టరు. ఈ వ్యవహారాన్ని నడిపించిన వారెవరో తేలాల్సిందే. సీఎం కుప్పం పర్యటన అనంతరం కఠిన చర్యలు తీసుకుంటారు. తిరుమలలో ప్రక్షాళన కొనసాగాల్సిందే. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా చాలా అంశాలు బయటకు రావాల్సి ఉంది. నెయ్యి కల్తీ జరిగిందని 2022లోనే తేల్చారు. ఆ నివేదికను తొక్కిపెట్టి అప్పటి వైకాపా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకు చర్యలు తీసుకోలేదో ఆ పార్టీ సమాధానం చెప్పాలి. దేవదేవుడి పట్ల వారికి నమ్మకం లేదనుకోవాలా? అని మంత్రి పయ్యావుల అన్నారు.

# ముగిసిన జనజాతర

(మొదటి పేజీ తరువాయి)
సంప్రదాయ సంగీత వాయిద్యాల చప్పుళ్లు.. కొమ్ముబూర శబ్దాలకు భక్తులు నృత్యాలు చేస్తుండగా.. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై కొలువై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతంలోని గుళ్లకు తీసుకెళ్లారు. సమ్మక్కను బయటకు తీసుకొచ్చిన సందర్భంలో భక్తులంతా 'సమ్మక్క తల్లికి జై.. అందరినీ సల్లంగ చూడమ్మ'.. అని వేడుకుంటూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. పూజారుల బృందానికి చుట్టూ మూడంచెల భద్రతతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సహా పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మొత్తంగా మేడారం మహా జాతర ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు . నాలుగు రోజుల్లో రెండు కోట్ల మంది పైచిలుకు భక్తులు మేడారం జాతరకు తరలి వచ్చారు. మహా జాతర వేళ భక్తులు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. తల్లుల వనప్రవేశంతో వన జాతర పూర్తయ్యింది. సాయంత్రం సమయంలో గద్దెలను పరిశుభ్రం చేసి, గిరిజన పూజారులు అమ్మవార్లకు సంప్రదాయ పూజలను నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ దేవతల పనప్రవేశం కార్యక్రమం ఆరంభమయ్యింది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాఘట్టం జనవరి 28 నుంచి 31వరకు జరుగగా.. శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలను ఆచరించి వన దేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. సమ్మక్క సారలమ్మలకు చీర, ఒడిబియ్యం, సారె పోసి దేవతలను మనసారా కొలుచుకున్నారు. సమ్మక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యలు పూజల అనంతరం పనప్రవేశం చేయిస్తారు. సమ్మక్కతల్లి చిలుకల గుట్టకు వెళ్లనుండగా సారలమ్మ కన్నెపల్లికి చేరుకోనున్నారు. అదేవిధంగా ఏటూరునాగారం మండలం కొండాయికి గోవిందరాజు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల కు పగిడిద్ద రాజును తిరిగి చేర్చనున్నారు. ఈ తంతుతో మహాజాతర ముగిసింది. అమ్మవార్ల దర్శనం అనంతరం మళ్లీ వస్తాం తల్లీ అంటూ భక్తులు ఇండ్లకు పయనమయ్యారు. జాతరలో చివరిరోజు మేడారంలోని వసదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ అమ్మవార్లకి మొక్కులను సమర్పించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు వారికి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. హైకోర్టు జడ్జిలు సృజన, రాణి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో భక్తులు నానా అవస్థలు పడ్డారు. దర్శనం సాఫీగా జరిగినా, రిటర్న్ జర్నీ ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని వాపోయారు. గంటల కొద్దీ బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

(మొదటి పేజీ తరువాయి)
సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ అధికారులు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి.. పైశాచిక ఆనందం పొందడం దారుణం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది కేవలం 'పైశాచిక ఆనందం' పొందడమేనని కేటీఆర్ విమర్శించారు. చట్టం, న్యాయంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అక్రమ కేసులను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చేస్తోన్న ప్రతి తప్పుడు పనిని ప్రజల ముందు పెడతామని, సమయం వచ్చినప్పుడు ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

## రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాను ఇబ్బందులు గురిచేస్తున్నారు: నటుడు విజయ్

తాను నటించిన 'జన నాయగన్' చిత్రం విడుదల ఆలస్యం కావడంపై నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ స్పందించారు. తాను రాజకీయాల్లోకి రావడం వల్లే తన సినిమాను ఇలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తన కారణంగా నిర్మాతకు నష్టం జరుగుతోందని అన్నారు.
తన నిర్మాతల గురించి ఆలోచిస్తే బాధగా ఉందని అన్నారు. రాజకీయ రంగంలోకి వచ్చేటప్పుడు వీటన్నింటికి సిద్ధపడ్డానని ఆయన పేర్కొన్నారు. తన సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించానని అన్నారు. వాస్తవానికి ఈ చిత్రం డిసెంబర్ 9న విడుదల కావాల్సింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలికంగా స్టే విధించగా, నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన సుప్రీంకోర్టు, మద్రాస్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. ఈ నెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిన డివిజన్ బెంచ్, దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.

## మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)
. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు. విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బాధ్యతగల పౌరుడిగా దర్యాప్తునకు సహకరిస్తా

అది తన రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని తెలిపారు. వారు వ్యవహరించిన తీరు చట్టాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ను సిట్ అధికారులు తుంగలో తొక్కారని అన్నారు. సిట్ అధికారుల నోటీసుకు కేసీఆర్ శనివారం బదులిచ్చారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. ఈ మేరకు కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. సిట్ అధికారులు రెండు సార్లు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధమనీ, చట్టాలను అతిక్రమించి ఇచ్చారని తెలిపారు. మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటం వల్ల వేరే రోజు విచారణ తేదీ ఇవ్వాలన్నానని గుర్తు చేశారు. 65 ఏండ్లుపైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 సీఆర్‌పీసీ నిబంధనలను ప్రస్తావించానని తెలిపారు.
తదుపరి నోటీసులన్నీ ఎర్రవల్లిలోని తన నివాసానికే పంపాలంటూ కోరానని పేర్కొన్నారు. ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు ఏసీపీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి తొమ్మిది గంటలకు నందినగర్ నివాసంలోని తమ ఇంటి గోడకు అతికించినట్టు తెలుస్తోందని తెలిపారు. ఆ లేఖ ఏసీపీ పంపినట్లయితే, వారి సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నానని పేర్కొన్నారు. ఇది భారత రాజ్యాంగం, చట్టం, సుప్రీంకోర్టుల పట్ల ఏమాత్రం గౌరవం లేదనే విషయాన్ని సూచిస్తుందని వివరించారు. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలను జారీ చేసిందని గుర్తు చేశారు.


జర్నలిస్ట్ వార్త

ఆదివారం 1 ఫిబ్రవరి 2026

# ముల్కనూర్ సమ్మక్క సారలమ్మ జాతర విజయవంతం

## అమ్మవార్ల వన ప్రవేశంతో ముగిసిన జాతర ఉత్సవాలు





**భీమదేవరపల్లి/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర శనివారం ఘనంగా ముగిసింది. జాతరలో లక్షలాది భక్తులు పాల్గొని అమ్మవారి వన ప్రవేశాన్ని దర్శించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కుల ఐలయ్య, సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి నేతృత్వంలో భక్తులకు వసతులు కల్పించారు. 25 సంవత్సరాల తర్వాత గన్ ఫైర్‌కు అధికారిక అనుమతి ఇచ్చినందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జాతరలో భక్తులు సంప్రదాయ ప్రకారం బెల్లం సమర్పణ, మొక్కులు చెల్లింపులు చేశారు. చుట్టుపక్కల మండలాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ సహకారంతో జాతర విజయవంతమైంది. కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు ఉసకోయిల ప్రకాష్ మాట్లాడుతూ.. జాతర విజయవంతానికి కృషి చేసిన ఉత్సవ కమిటీ, అధికారులు, స్థానిక నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమత బాలకృష్ణ, మాజీ చైర్మన్ శ్రీరామోజు సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు మాడుగుల గోపి, పోగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్‌లో గద్దర్ జయంతి..

## మహనీయుల జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నివాళి సభ



**భీమదేవరపల్లి/ జనవరి31 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ సెంటర్‌లో శనివారం మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విప్లవ గాయకుడు, సామాజిక యోధుడు గద్దర్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతం కోసం అచంచలంగా నిలబడి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని, పోలీసు కాల్పులను సైతం లెక్కచేయకుండా సమాజంలో ఉన్న అసమానతలు, అణచివేతలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప యోధుడు గద్దర్ అని కొనియాడారు. పీడిత, తాడిత ప్రజలందరిని ఏకం చేసి నియంత పాలకులకు సింహస్వప్నంగా మారిన వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. మహిళలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు మాత్రమే కాకుండా పోలీసులకు ఎదురయ్యే సమస్యలను కూడా ప్రశ్నించిన ధిక్కార స్వరం గద్దర్ అని తెలిపారు. తన కవితలు, పాటల ద్వారా ప్రజల బాణీల్లోకి చేరి, పల్లె నుంచి అడవి దాకా అలుపెరుగని పోరాటం సాగించి సమసమాజ నిర్మాణానికి కృషి చేశారని అన్నారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని గ్రహించి, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మధ్యకు వచ్చి రాజ్యాంగమే శిరోధార్యమని, బుల్లెట్‌కు బదులు బ్యాలెట్‌నే శక్తివంతమైనదిగా ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు గద్దర్ అని వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజు, భీమదేవరపల్లి జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి పాల్గొన్నారు. ముల్కనూర్ 1వ వార్డు సభ్యులు మాడుగుల అశోక్, రేణికుంట్ల బిక్షపతి, వేముల జగదీష్, మాడుగుల నరేందర్, గొర్రె సదానందం, మాడుగుల రాజమౌళి, చాంద్ పాషా తదితరులు హాజరయ్యారు.

# ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

## -18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పొన్న రవి





**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త) :** ఆశీర్వదించి గెలిపిస్తే వార్డు ను అన్నివిధాల అభి వృద్ధి చేసి చూపిస్తానని 18 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పొన్న రవి కోరారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం పొన్న రవి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందజేస్తూ, ప్రజాల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు వార్డులోని ప్రతి ఇంటికి అందే లా కృషి చేస్తానన్నారు. వార్డులోని ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి స్వామి నాయక్, రమేష్, ప్రభాకర్ తదితర కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేయాలి

## . సీనియర్ సివిల్ జడ్జి సుచరిత



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త ) :** ఆర్ టి ఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వ ర్యంలో ప్రజలకు ఉపయోగపడే మంచికార్యక్రమాలు చేయాలని జనగాం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇ సుచరిత అన్నారు. స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో జనగాం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సుచరిత ఆధ్వర్యంలో ఆర్ టి ఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ క్యాలెండరు ఆవిష్కరణ చేయడం జరిగిం ది. ఈ సందర్భంగా జడ్జి సుచరిత మాట్లాడుతూ ప్రజలకు మంచికార్యక్రమలను మీ సొసైటీ ద్వారా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ టి ఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ అడ్వకేట్ గద్దె అనిల్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ భాస్కుల నాగరాజు, ఆకుల శ్రీకాంత్, దండు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి వార కళ్యాణం



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త);** చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగు లు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివా రంరోజును పురస్కరించుకొని ఆలయకార్యనిర్వాహణాధికారి బి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో శ్రీ స్వామివారి వార కల్యాణము వేదమంత్రోచరణల తో అర్చకులు వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ అనంతరం అన్న ప్రసాదవితరణ కార్యక్రమంచేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కె మోహన్, ప్రధాన అర్చకుడు బ్రాహ్మ ణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీ రంగా చార్యులు, కృష్ణమా చార్యులు,రికార్డ్ అసిస్టెంట్ వీరన్న,ఆలయసిబ్బంది విశాల్, కృష్ణా, మహేష్, రాజశేఖర్, అన్నప్రసా ద దాతలు తౌటిరెడ్డి తార – పెద్దిరెడ్డి, అఖిల వివి ధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానం చేరుకోవాలి

## -తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన





**స్టేషన్ ఘన్పూర్/ జనవరి 31 ( జర్నలిస్టు వార్త ) :** విద్యార్థిని, విద్యార్థులు ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థానం చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన (ఐఏఎస్) అన్నారు. స్టేషన్ ఘన్ పూర్ పట్టణ కేంద్రంలోని శివునిపల్లి లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమీషనర్ శ్రీదేవసేన సందర్శించారు. శ్రీ దేవసేన కళాశాలకు చేరుకోగానే కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టి నెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి కమిషనర్ కు పుష్ప గుచ్ఛంఅందించి కళాశాలకుసాదరంగా ఆహ్వానిం చి కళాశాలలోని తరగతి గదులను చూపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కళాశాల విద్యా కమీషనర్ శ్రీదేవసేన కళాశాల విద్యార్థులనుద్దేశించి మాట్లా డుతూ విద్యార్థులు చదువును మధ్యలో ఆపకుం డా అనుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు ఇష్టం తో చదువుకోవాలనీ, ఉన్నత స్థానం చేరుకోవడా నికి నిరంతరం కృషి చేయాలని అంటూ వారికి మార్గనిర్దేశనం చేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టేషన్ ఘన్పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యా ర్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగ పరుచుకోవా లని సూచించారు. కళాశాల లో విద్యార్థులకు మంచివిద్యాబోధనను అందిస్తు,కళాశాల అభివృ ద్ధికి దోహద పడుతూ అందరినీ ముఖ్యంగా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళిని, అధ్యాపకబృందాన్ని అభినందించారు. అనంతరం కళాశాల వసతుల కల్పనకోసం, కళాశాల అభివృ ద్ధికి తాను పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాన ని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల భోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లారం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం విజయవంతం



**తల్లాడ/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** మండలం పరిధిలోని మల్లారం గ్రామంలో జిల్లా పశుఖానాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం సర్పంచ్ కిరణ్ కుమార్ అభినందనీయం అన్నారు. శనివారం ఈ శిబిరాన్ని సర్పంచ్ కిరణ్ కుమార్ ప్రారంభించి పశు స్వాస్థ్యకర్తలకు ప్రత్యేకంగా విలువనిచ్చారు. ఈ శిబిరంలో పశువులకు రక్త పరీక్షలు, దూడలకు నత్తల మందుల పంపిణీ, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, పశువులకు ఉచితంగా అవసరమైన మందులు అందజేయడం ద్వారా పశుగణాభివృద్ధికి మేల్కొలిపే సేవలు అందించబడ్డాయి. సర్పంచ్ కిరణ్ కుమార్ ఈ కార్యక్రమం సఫలమైందని చెప్పి, ఇలాంటి సేవలు గ్రామాభివృద్ధికి దోహదమని తెలిపారు.

# ప్రకృతిని ప్రేమిద్దాం, భూమిని కాపాడుదాం

## ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ స్ఫూర్తిదాయక ర్యాలీ




**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్) హనుమకొండ ఎన్.ఎస్.ఎస్ శీతాకాల శిబిరం భాగంగా ఆరవ రోజున వాలంటీర్స్ గ్రామంలో ప్లే కార్డ్స్ చేతిలో పట్టుకొని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వాలంటీర్స్ నేటి బాలలే రేపటి పౌరులు, పర్యావరణాన్ని కాపాడండి- భవిష్యత్తుకు పునాది వేయండి ప్రకృతిని ప్రేమిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం ప్రార్థించే పెదాల కన్నా సేవ చేసే చేతులు మిన్న భూమి మన ఇల్లు దాని పచ్చగా పరిశుభ్రంగా ఉంచుకుందాం వంటి నినాదాలు కివ్వగా, గ్రామ వీధులలో తిరుగుతూ ప్రతి ఇంటికి వెళ్లి యజమాని పేరు, ఇంటి నెంబర్, మరుగుదొడ్లు ఉన్నాయా లేదా 0-6 వయసు కలిగిన వారి సంఖ్య, 6-15 వయసు మధ్య ఉన్నవారు ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారా అనే వివరాలను సర్వే చేశారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో ఆరోగ్యశాఖ ఎల్కుర్తి సబ్ సెంటర్ నుండి కే. అంజమ్మ, ఏ.ఎన్.ఎం కార్యక్రమానికి విచ్చేసి సీజనల్ వ్యాధులు ఎలా వస్తాయి, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందడం, వర్షాకాలంలో నీరును వేడి చేసి వడబోసి తాగడం, గర్భిణీ స్త్రీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నవజాత శిశువుల నుంచి 10 సంవత్సరాల వరకు పిల్లలకు అవసరమైన టీకాలు ఏ విధంగా వేయాలో వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రాజ్ కుమార్, కళాశాల అధ్యాపకులు ఎస్. దయాకర్, రాజ్ కుమార్, రమేష్, ఆశా కార్యకర్తలు మంజుల, సుమలత, సర్పంచ్ నరిశెట్టి, సుధాకర్, కారోబార్ బుచ్చిమల్లు పాల్గొన్నారు.

# ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేరుస్తాం

## గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం - సర్పంచ్ దీవెల వెంకటేశ్వర్లు



**తల్లాడ/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలుపుతానని, ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తప్పకుండా నెరవేరుస్తానని గ్రామ సర్పంచ్ దీవెల వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నో రోజులుగా పేరుకుపోయిన రోడ్డుకు ఇరుపక్కల ఉన్న చెత్తను డోజర్, ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. అలాగే సైడ్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను కూడా శుభ్రం చేయించారు. గ్రామంలో సక్రమంగా వెలగని పాత వీధి దీపాలను తొలగించి, నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. గ్రామంలో ఇంకా ఏవైనా లోటుపాట్లు ఉన్నట్లయితే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రుద్రాక్ష రామకృష్ణ చారి, గ్రామ సెక్రటరీ ఎస్.కే. మీరా, గ్రామ వార్డు మెంబర్లు భూషణం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని జగ్గు తండా సర్పంచ్ , ఉపసర్పంచ్ లో ఏఈ కి వినతి.



**బయ్యారం/జనవరి 31(జర్నలిస్ట్ వార్త);**
, మండలంలోని జగ్గు తండా పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, శనివారం జగ్గు తండా సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ,ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి విద్యుత్ ఏఈ సుమన్ కలిసి వారి గ్రామ సమస్యలను విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎయ్యి తొందరలోనే విద్యుత్ సమస్యలను పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు దీనితో పాలకవర్గం నాయకులు ఏయికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. కొత్త పాలకవర్గానికి సర్పంచ్ , ఉపసర్పంచ్ కు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు

# గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు సీఎం కప్ క్రీడలు దోహదం చేస్తాయి.

## -సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.



**బయ్యారం/ జనవరి 31.జర్నలిస్ట్ వార్త);**
సీఎం కప్ క్రీడా పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహద పడుతాయని బయ్యారం సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభను చాటేలా విద్యార్థులు సీఎం కప్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ,మండల,జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించి విద్యార్థులు మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవేంద్ర చారి,క్రీడల ఇన్చార్జ్ పిడి అరుణ,రామయ్య,పీడీ వాలు నాయక్, కవిత,రవీందర్,కంకటి నారాయణ,సూర్యనారాయణ,భవాని పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు అండగా మాస్ సంస్థ

**ఐనవోలు/జనవరి31 (జర్నలిస్ట్ వార్త):** పేద బిడ్డలు ఉన్నత చదువులు చదివి, సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా మహా ఆది సేవ సంస్థ కృషి చేస్తోందని సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ విజయ్ కుమార్ సీనపెల్లి అన్నారు. శనివారం ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాడపాక భారత్ అనే విద్యార్థికి సంస్థ తరపున ఆర్థిక సాయాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని సి వి ఆర్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాడపాక భారత్ తండ్రి లేని నిరుపేద విద్యార్థి. తల్లి కూలి పనులు చేస్తూ తన కొడుకును చదివిస్తోంది. భారత్ చదువులో ఎంతో ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు కొనసాగించడం కష్టతరంగా మారింది.
ఈ విషయాన్ని డాక్టర్ జన్ను నరేందర్ మాస్ సంస్థ




దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించిన సంస్థ.. భారత్ కాలేజీ ఫీజు, పుస్తకాలు, 6 నెలల హాస్టల్ వసతి నిమిత్తం రూపాయలు 30,400 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ పిలుపునిచ్చిన పే బ్యాక్ టు ది సొసైటీ సిద్ధాంతంతో గత 6 ఏళ్లుగా సంస్థ పనిచేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు సుమారు 250 మంది పేద విద్యార్థులకు రూపాయలు 33,18,208 మేర ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఉన్నత విద్య చదవాలనుకునే నిరుపేద విద్యార్థుల సహాయం చేయాలనుకునే దాతలు 9010730380 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఇరుగు వెంకన్న, ఇల్లందుల బాబు, లింగాల శ్రీనివాస్, డాక్టర్ విక్రమ్ కుమార్, మునిగాల వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీలలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న తహశీల్దార్ నాగరాజు.



**బయ్యారం/ జనవరి 31(జర్నలిస్ట్ వార్త);**
మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గ్రామ సర్పంచ్ ప్రవీణ్ నాయక్ తో కలిసి మండల తహశీల్దార్ నాగరాజు క్రీడాకారులతో కలిసి టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వంతో పాటు మంచి స్నేహభావం పెరుగుతుందని,అలాగే సామాజిక సేవా భావాలు అలవడతాయని తెలిపారు. సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి,గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి వీరభద్రం, కారుబోతుల రామ్మూర్తి,చల్లా సురేష్,బొమ్మకంటి రాంబాబు,భూకే శ్రీను,స్వరూప, కిషన్,నాగమ్మ,మదన్,బుర్ర దుర్గారావు,రఘుపతి,ప్రశాంత్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం గొల్లకురుమలు యుద్ధవేగంతో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం

## జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్

**రాయపర్తి/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ శనివారం హక్కుల సాధన కోసం గొల్లకురుమలు సజాగ్రతతో పోరాటానికి సిద్ధమవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరికి మధుకర్, గొల్లకురుమలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, సంఘం సాధించుకున్న ఫలితాలు 1016 మరియు 559 జీవోలను పగడ్బందీగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ జీవోలు ప్రకారం తుమ్మ చెట్లు, పంచరాయి, పోరంబోకు, చెరువు శికం, పంటకు వీలులేని భూములలో మూగజీవాల కోసం మేత సాధించడానికి ఉపయోగించవచ్చు. పరికి మధుకర్ పేర్కొన్నారు, ప్రతి సొసైటీకి 20 ఎకరాల భూమి కేటాయించాలి, ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెల



కాపరికి 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలి, సొసైటీ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి, ప్రతి గ్రామంలో సొసైటీ భవనాలు నిర్మించాలి, 50 సంవత్సరాలు నిండిన గొల్లకురుమలకు పెన్షన్ కేటాయించాలి. ఈ సందర్భంగా, హక్కుల సాధనకై పోరాటమే మార్గమని గొల్లకురుమలను పరికి మధుకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గొల్లకురుమల మండల అధ్యక్షుడు చందు మల్లేష్, మండల కార్యదర్శి గాజు యాకయ్య, ఉపాధ్యక్షులు బెల్లి రాజాలు, యాదవ సంఘ పెద్ద గొల్ల కసరబోయిన రాజు, చందు కుమార్, అధ్యక్షులు కుంట హనుమంతు, ఉపాధ్యక్షులు కసరబోయిన శ్రీను, కార్యదర్శి చందు సతీష్, కుంట రాజు, బండి లింగన్న, పనికిరా మల్లయ్య, కుంట ప్రభాకర్, ఉడత రాజు, నాగుల రాంబాబు, బి. లింగయ్య, నాగుల రాజు, బూడిక నాగరాజు, దండిగా యాకయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం మండల విద్యాశాఖ అధికారిగా లక్ష్మణరావు బాధ్యతలు.

**బయ్యారం/ జనవరి 31(జర్నలిస్ట్ వార్త);**
మండల విద్యాశాఖ అధికారిగా దేవేంద్ర చారి శనివారం పదవీ విరమణ గావించడంతో ఆ స్థానంలో బయ్యారం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. లక్ష్మణరావు మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను పటిష్టం చేసే దిశగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాంపురం కాంప్లెక్స్ హెచ్ఎం లింగరాజు,ఇతర ఉపాధ్యాయ బృందం బాలు నాయక్, రూప్లా నాయక్ మంగీలాల్, రామారావు, ఎమ్మార్సీ, స్టాఫ్ రవి, మోహన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు



# పోట్రూ రామయ్యకు ఘన నివాళులు

## దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల సానుభూతి



**తల్లాడ/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన పోట్రూ రామయ్య దశదిన కార్యక్రమానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై, రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, జక్కంపూడి కిషోర్, కటికి కిరణ్ కుమార్, గణేషుల రవి, అడపా అనిల్, దీవెల కృష్ణయ్య, శరత్, ప్రభాకర్ రావు, కొత్త వెంకటగిరి సర్పంచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, పోట్రూ రామయ్య మరణం కుటుంబానికి, గ్రామానికి తీరని లోటు అని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు

# పల్లె నుంచి జాతీయస్థాయికి క్రీడాకారులు

## సీఎం కప్‌లో ప్రతిభకు గుర్తింపు

**సత్తుపల్లి/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):**
ప్రతిభగల క్రీడాకారులను పల్లె స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీల వరకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పల్లె, పట్టణ స్థాయిల్లో "సీఎం కప్" క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సత్తుపల్లి పట్టణ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను రెండు రోజుల పాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. శనివారం సాయంత్రం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ






పాఠశాలల హెడ్మాస్టర్లు నాగేశ్వరరావు, సొందు, లయన్స్ క్లబ్ బాధ్యులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, గోగడ రవికుమార్, విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, క్రీడలను ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు చదువులో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్రీడా పోటీలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
ఆదివారం 1 ఫిబ్రవరి 2026

# చిన్న తప్పిదమే పెద్ద ప్రమాదం

## రోడ్డు భద్రత అధికారుల బాధ్యత మాత్రమే కాదు - ఎం.వి.ఐ శ్రీనివాసరావు






**సత్తుపల్లి/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** రోడ్డు భద్రత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జే.ఎన్. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రోడ్డు నియమాలు పాటిస్తేనే ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని ఆయన అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల (జనవరి 1 నుంచి 31 వరకు) ముగింపు సందర్భంగా శనివారం సత్తుపల్లిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారితో రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలు, స్కూల్ వాహనాల డ్రైవర్లు, గంగారం బెటాలియన్ పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు జే.ఎన్. శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ, మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ఇలా చేస్తే వారి భవిష్యత్తుతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రయాణాన్ని సుఖవంతంగా మార్చుకోవాలని కోరారు. వేగం కన్నా ప్రాణమే మిన్న అనే విషయాన్ని గుర్తించి వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.అవగాహన ప్రదర్శనలో వినిపించిన రోడ్డు భద్రత నినాదాలు, పాటలు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారి సత్యనారాయణ, ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం సత్తుపల్లి డివిజన్ (ట్రస్మా) అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు, వివిధ పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలు పాల్గొన్నారు.

# నామినేషన్ల పరిశీలన పూర్తి

## ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణకు అవకాశం




**వర్ధన్నపేట/జనవరి 31(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల ఘట్టం ముగిసి, తదుపరి ప్రక్రియ అత్యంత పకడ్బందీగా కొనసాగుతోందని ఎన్నికల సహాయక జిల్లా అధికారి , వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తెలిపారు. శుక్రవారం వరకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా పూర్తయిందని, శనివారం నుండి నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఈ పరిశీలన ముగిసిన అనంతరం, పోటీ నుండి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్ర 3 గంటల వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల గురించి వివరిస్తూ, అభ్యర్థులు ఒకే వార్డు నుంచి ఒకే నామినేషన్ సెట్ ద్వారా పోటీ చేయాల్సి ఉంటుందన్నారు. ఒకే అభ్యర్థి వేర్వేరు వార్డుల్లో నామినేషన్లు దాఖలు చేస్తే అవి చెల్లవని, నిబంధనల ప్రకారం ఒకరికి ఒకే వార్డులో సమర్పించిన నామినేషన్ మాత్రమే పరిగణనలోకి తీసుకోబడుతుందని స్పష్టం చేశారు. కొంతమంది అభ్యర్థులు రెండు, మూడు సెట్లు దాఖలు చేసినప్పటికీ, నిబంధనలకు లోబడే వాటిని పరిశీలిస్తామని, అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం క్షేత్రస్థాయిలో ఇప్పటికే 'ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, జోనల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఆర్ ఓ లు,ఏఆర్‌ఓలు తమ విధుల్లో నిమగ్నమయ్యారని, శనివారం పీఓలకు శిక్షణ కార్యక్రమం కూడా పూర్తయిందని చెప్పారు. కౌంటింగ్ రోజున అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందికి త్వరలోనే మరో విడత శిక్షణ ఉంటుందని, ప్రతి విషయంలోనూ పారదర్శకత పాటిస్తూ ఎన్నికలను విజయవంతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రకృతిని ప్రేమిద్దాం భవిష్యత్తును కాపాడుదాం

## ఎన్ఎస్ఎస్ శిబిరంలో పర్యావరణ శిబిరం







**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజనవరి 31 (జర్నలిస్టు వార్త):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్), హనుమకొండ ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం సందర్భంగా వాలంటీర్లు స్పష్టం చేశారు. శిబిరంలో భాగంగా ఆరవ రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో ప్లే కార్డులు చేతబట్టి పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నేటి బాలలే రేపటి పౌరులు, పర్యావరణాన్ని కాపాడండి భవిష్యత్తుకు పునాది వేయండి, ప్రకృతిని ప్రేమిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం, ప్రార్థించే పెదాల కన్నా సేవ చేసే చేతులు మిన్న, భూమి మన ఇల్లు దాన్ని పచ్చగా పరిశుభ్రంగా ఉంచుకుందాం వంటి నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో తిరిగారు.ర్యాలీ అనంతరం వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి యజమాని పేరు, ఇంటి నంబరు, మరుగుదొడ్లు ఉన్నాయా లేదా, 06 సంవత్సరాల పిల్లల సంఖ్య, 615 సంవత్సరాల వయసు పిల్లలు ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలలకు వెళు న్నారా అనే వివరాలతో సర్వే నిర్వహించారు.మధ్యాహ్నం జరిగిన సమావేశంలో ఆరోగ్యశాఖ ఎల్కుర్తి సబ్ సెంటర్‌కు చెందిన ఏఎన్ఎం కే. అంజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయో, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని హెచ్చరించారు. వర్షాకాలంలో నీటిని వేడి చేసి కాచి వడబోసి తాగాలని సూచించారు.అలాగే గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నవజాత శిశువుల నుంచి 10 సంవత్సరాల వయసు పిల్లల వరకు వేసే టీకాల వివరాలను దశలవారీగా వివరించారు. టీకాల ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను ఎలా కాపాడుకోవచ్చో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రాజ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు ఎస్. దయాకర్, రాజ్‌కుమార్, రమేష్, ఆశా కార్యకర్తలు మంజుల, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగులకు అన్నదానం

## దామళ్ల ఏసుపాదం వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం





**మధిర/జనవరి 31 (జర్నలిస్ట్ వార్త):** మధిర నియోజకవర్గ పరిధిలోని చెన్నకేశవపురం గ్రామ వాస్తవ్యులు దామళ్ల ఏసుపాదం వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మానవతా సేవా కార్యక్రమం నిర్వహించారు. దామళ్ల ఏసుపాదం కుమారులు పాల్‌రాజ్, బోసు బాబు, వందేమాతరం మరియు కుమార్తె సుదులగుంట వాణి కలిసి మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దామళ్ల ఏసుపాదం పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, ఆయన లేని లోటును భర్తీ చేసుకునే ధైర్యాన్ని ఆయన సతీమణి లలితమ్మకు, కుటుంబ సభ్యులకు దేవుడు ప్రసాదించాలని కోరుకుంటూ మానసిక దివ్యాంగ పిల్లల తరఫున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమ తండ్రి జ్ఞాపకార్థంగా మానసిక దివ్యాంగ పిల్లలతో అన్నాన్ని పంచుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని పాల్‌రాజ్, బోసు బాబు, వందేమాతరం, వాణి తెలిపారు. అవసరమైన వారికి సేవ చేయడమే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వారి సన్నిహితులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు. మదర్ థెరిస్సా సేవాసదనం నిర్వాహకులు, మానసిక దివ్యాంగ పిల్లలు దామళ్ల ఏసుపాదం కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

## మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



మాట్లాడుతున్న టెస్ట్ కాబ్ చైర్మెన్ మార్నెని రవీందర్ రావు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి



సమావేశం లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి

**వర్ధన్నపేట/జనవరి 31(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలోని ఎన్నికల కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12వ వార్డుకు చెందిన సుమారు 40 మంది బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సర్వేల ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉంటుందని, అభ్యర్థి ఎవరైనా సరే పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని 12 వార్డులను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని, వార్డుకు పదిమంది చొప్పున ఇన్‌ఛార్జులను నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి సహకారంతో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వర్ధన్నపేటను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వర్ధన్నపేట అభివృద్ధి బాధ్యత తనదని, ఇక్కడ 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే గ్యాస్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని గుర్తు చేశారు. ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ఉంటుందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 80 శాతం స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, ప్రతి కార్యకర్త తానే రేవంత్ రెడ్డిగా, పొంగులేటిగా భావించి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యాధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరిని సమన్వయంతో ముందుకు పోవాల్సిన ఎవరసం ఉందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా ప్రచారం చేసి వర్ధన్నపేట గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఇండ్లు లేని ప్రతి ఒక్కరికీ మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల వచ్చేలా చొరవ తీసుకోవాలని రిక్వెస్ట్ చేశారు. అందుకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందించి ప్రతి పేదవాడికి ఇండ్లు అందిస్తాం మని స్పష్టం చేస్తారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పసునూరి దయాకర్, సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, నిమ్మాని శేఖర్ రావు, వివిధ వార్డుల ఇన్‌ఛార్జులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి

## తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హాస్పిటల్ లో మృతి






**నిజామాబాదజనవరి 31 (జర్నలిస్టు వార్త):** నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ జి. సౌమ్య చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. ఆమె మరణం పట్ల నిమ్స్ యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.నిజామాబాద్ నగరంలో తనిఖీల సమయంలో గంజాయి తరలిస్తున్న ముఠా.. కారుతో ఢీ కొట్టడంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జనవరి 25న నిమ్స్ లో చేర్చారు. వివిధ విభాగాల నిపుణుల ద్వారా అవసరమైన అన్ని అత్యాధునిక వైద్య సేవలు, లైఫ్ సపోర్ట్ చికిత్సలు అందించారు. వైద్యులు అత్యంత శ్రద్ధతో నిరంతర వైద్య ప్రయత్నాలు చేసినప్పటికీ, సౌమ్య ను కాపాడలేక పోయినట్టు వైద్యులు తెలిపారు. శనివారం రాత్రి 9:41 గంటలకు మృతిచెందారు. ఆమె మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్టు నిమ్స్ వైద్యులు తెలిపారు